# శాపగ్రస్తుడు

చెదలు బట్టిన కాగితాల్లోంచి గతం రాలిపడుతోంది... వానతుంపరలా.

అటకమీది డైరీల్ని తీసి దుమ్ముదులిపి నీ 'స్వచ్ఛత'ను వెదుకుతున్నాను.

సరిగ్గా మూడు సంవత్సరాలు.... నువ్వెళ్ళిపోయి!!!

ఎక్కడో తళుక్కుమన్న చిర్నవ్వుల మీద రాబందులు రక్కిపోతాయి. నేను వెక్కి వెక్కి ఏడుస్తాను....

గోళ్ళలో ఇరుక్కుపోయిన అణుమాత్రపు ఆనందాన్ని సూదుల్తో చిదిమేసిన నువ్వు.... చిదిమితే చిమ్మిన చీమునెత్తుర్లో కన్పించే ప్రతి బింబంలో కూడా నువ్వే...

అణువులో.... అవనిలో.... అనంతంలో.... ఎక్కడున్నావో??

నేను మాత్రం శిలువేసిన స్వప్నపక్షిలా ఈ చీకటి గదిలో ఒ...న్...ట...రి...గా!!!

నీ తలపుల్లో ఎన్ని జ్ఞాపకాల్ని త్రవ్వుకు తిన్నావో...? ఎన్ని నిశిరాత్రుల్ని కాల్చుకు తిన్నావో నీకేం తెలుసు...

నేస్తం...

మోకాళ్ళ కడుపులో దాచుకొని నీ స్మృతుల శకలాలమీద శయనిస్తే ఎన్ని యుగాలైనా చావురాదు...

రెప్పల్ని పైకిలేపి కనుబొమ్మలకు మేకులు దిగ్గొట్టినట్టు... నిరీక్షిస్తే నువ్వు రావాలన్న ఆశ! పోస్ట్ అన్నకేక విని లేస్తాను. ఎంతకీ నువ్రావు. వెయిటింగ్ ఫర్ గోడోలా....

వాడు పోతూనే ఉంటాడు. కష్టాలనీ, కన్నీళ్ళనీ.... ప్రేమనీ, పేరంటాన్ని.... వినోదాన్ని, విషాదాన్ని జబ్బ సంచిలో కుక్కి పోతూనే ఉంటాడు.

నీ గురించి మర్చిపోయాడేమోననుకొని వాడి సైకిల్ చక్రాల గుర్తులు పట్టుకొని పరిగెడతాను ఎంతోదూరం...

కాళ్ళు పీకేలోగా రైల్వేస్టేషనొస్తుంది. కళ్ళుత్రిప్పి సిమెంట్ బెంచీ మీద కూలబడితే అక్కడి పోరగాళ్ళు రాళ్ళతో కొడతారు.... ఒగరుస్తూ గదికొచ్చి నీ జ్ఞాపకాలతో రోదిస్తుంటే దూరంగా రైలుకూత విన్పిస్తుంది.

నువ్వెళ్ళిపోయే ముందుకూడా అదే కూత.... నరనరాల్లో బాధ ప్రవహిస్తుంది. మబ్బుపట్టిన ఆరోజు... కన్నీళ్ళు ఎంతగా వర్షించాయని?

ఫస్ట్‌క్లాస్ కంపార్టుమెంటులోంచి వూపుతున్న నీ చెయ్యి దూరమవుతుంటే... నా గొంతులో కోయిల ఉరేసుకుంది. నువ్వు పోయాక ఎంతటి వర్షం పడింది. తడుస్తూ రైలుపట్టాల మీదే కూచున్నాను చాలాసేపు.

విషాద ముషాయిరాని పలికించే సమాంతరరేఖలు ఎన్ని కథలు చెప్పాయి.... కంకర రాళ్ళ మధ్య కన్నీటి విత్తనాల్ని నాటుతూ గదికొస్తే చాలు....

చాప చిరిగినా.... సాలెపురుగు కదిలినా... పుస్తకాల పుటలు గుండెలు బాదుకున్నా... నువ్వు గుర్తొస్తావు.

## అంజలి

ఆరోజు కొత్త సంవత్సరం... కేలండర్ తలంటుపోసుకుంది. అప్సరసలా అనుకోకుండా నా గది కొచ్చి 'ఈరోజు ఏం చేసావ్?' అనడిగావ్.

'జాతీయగీతం ఆలపించాను' అని నేనంటే.... నువ్వనవ్వావు...

చాలాసేపు నవ్వావు.... తెరలు తెరలుగా నవ్వి 'ఎందుకు?' అని ప్రశ్నిస్తే 'నీకోసం' అన్నాను.

"నా కోసమా? ఎందుకు?"

"జాతీయగీతంలో నీపేరుంది కదా! ఈ నూతన సంవత్సరంలో దేశభక్తితోపాటు నీ ప్రేమభక్తినీ పాడినట్టుగా ఉంటుందని"

అప్పుడు పోయావు మౌనంలోకి... పగుళ్ళు వారిన గుండెల్లో క్షణాల్ని నాటుతూ. మరో క్షణంలో నీ రెప్పలచిప్పలు బోర్లించగా బొట్లు బొట్లుగా జారి తప్పన్న కన్నీరు ఇంకిపోయింది. గతంలాగే.

నా కర్థం కాలేదు కాని... క్షమించమన్నాను.

నువ్వు తిరిగి నవ్వే వరకూ నాలో ఎన్ని బ్లాస్టింగులు!

నీ తల్లోని గులాబీ నా దోసిళ్ళలో ఉంచి.... అరచేతిని చుంబించి ఆనక గ్రీటింగ్స్‌ని అందించి Few delights can equal the mere presence of one whoom we trust utterly

"జాతీయ గీతంలో ఆ పేరు మాత్రమే ఉంది. కాని అది పాకిస్థాన్ లోని బెలూచిస్తాన్‌లో పోయింది. అలాగే నా పేరు మాత్రమే మిగిలి... నేనెక్కడికో వెళ్ళిపోతే..."

అప్పటికిగాని నాకర్థం కాలేదు.

నవ్వుతూ అన్నావ్ "నేను దూరమైతే ఈ లవర్‌ని పోగొట్టుకొని నీ లివర్‌ను పాడుచేసుకోవుగదూ...."

నాలో మౌనం.... జాతీయగీతంలో లోపంవుందా? అదీ నీకు అన్వయించుకొంటేనే కాదూ.... ఆ కన్నీరు. నీలో ఎంతటి భావుకత?

"సారీ.... కొత్తసంవత్సరం రోజే బాధ పెట్టాను"

"అద్సరే... జాతీయగీతం తర్వాత స్కూలు పిల్లాడిలా 'ప్రతిజ్ఞ' చేసావా?" నీ మాటల్లో చిలిపితనంతో కూడిన వెక్కిరింత.

"అదీ నువ్వు చెయ్యి.." అని కోపంగా నేనంటే "ఎలా చెయ్యను? అది పురుషాధిక్యతతో రాసింది" అంటావు.

నీ ప్రతిమాటా నన్ను అచ్చెరువుల అగాధాల్లోకి తీసికెళ్తుంది. అక్కడే నన్ను నేను తడుముకుంటాను. నేను విస్మయంగా చూస్తే...

"నిజమే. ప్రతిజ్ఞలో.... నాదేశ వారసత్వ సంపద నాకు గర్వ కారణము. దీనికి "అర్హుడనగుటకై" సర్వదా నేను కృషిచేయుదును అంటారు. అర్హురాలగుటకై అనరే... ఇది పురుషాధిక్యతకాదా... నువ్వే చెప్పు" ప్రేమ జ్ఞానాన్ని పెంచుతుందా? ఏమో?

ప్రేమతో విజ్ఞాన శిఖరమై నిలిచిపోతావనుకున్నా... విస్ఫోటనా శకలమై మిగిలిపోతావనుకోలేదు. ఏ గీతాలు పాడనిప్పుడు? అదుగో... ఎవరో ఏడుస్తున్నారు.

ఏ తల్లి బిడ్డను పోగొట్టుకుందో.... ఏ భార్య భర్తను కోల్పోయిందో.... ఆ ఏడ్పు విని నా బరువుగుండె మూలుగుతుంది పెద్దక్కయ్యను తలచి... ఆయన అనంతంలో క్షమేకమై అనేక నెలలు గడిచినా... దాని కనుబొమ్మల మధ్య సూరీడు దిగిపోయి మళ్ళీ ఉదయించనేలేదు. విశాలమైన నుదిటిపై వెలితిని చూపే అంధకారం.

గుండెల్లోని తడిని తాకిచూసే స్పందన... నాకెందుకిచ్చావ్ భగవాన్? భగవంతుడంటే గుర్తొచ్చాడు. "ఈ ప్రపంచంలో అందరికంటే మంచివాడెవడు!? అనడిగితే నీ నించి 'దేవుడు' అన్న జవాబు.

'ఎందుకు?'

"ఎందుకంటే... బండబూతులు తిట్టినా బండలాగే పడివుండేది వాడొక్కడే కాబట్టి..." నీ నవ్వుల్ని మనసునాల్గుగోడల సేఫ్టీలాకర్లలో దాచి పెట్టుకుంటాను. ఆ నవ్వుల్ని నలిపేయడానికే మూకుమ్మడిగా వస్తారు వాళ్ళు. వాళ్ళ పళ్ళసందుల్లో పాములున్నాయి. నాలుక కింద జెర్రులుంటాయి." చిగుళ్ళనంటిపెట్టుకొని తేళ్ళు... కొండనాలుక చుట్టూ కొండ చిలువలు బుసకొడ్తాయి.

గదికి పడ్డ గాయాన్ని నాకిపోతారు....

వెళ్తూ వెళ్తూ నువ్విచ్చిన పుస్తకం గీతాంజలి.... దానిమీద నీకున్న దరిద్రానికి కవిత్వం రాయొచ్చు. అక్షరాల్ని మెరిపించటం కాదు.... అక్ష రాల్లో మెరవటం నేర్చుకోమన్నావు.

ఉల్కనై రాలిపోతున్నా...

క్షణకాలం తళుక్కుమన్నా ఆ వెలుగు నీ కోసమే....

## అమృతం

ఆ చలిరాత్రి... నిండుపున్నమి. వెన్నెల.... చంద్రుడు స్ఖలించి నట్టు

చిల్కాకోడూర్ వాగు బ్రిడ్జిమీద నీఒడిలో తలదాచుకున్న నాలాగా.. నా మొహంలోకి చూస్తున్న నీలాగ.... చంద్రుడి కలర్ నెగెటివ్‌లో కూడా మనిద్దరమే... ఆ దృశ్యం ఎప్పుడూ మర్చిపోను. చలిగా వుంది వెళ్దామా అని నేనంటే....

"ఆ చుక్కల్ని చూడు. ఆచుక్కల్లో నువ్వు నా కన్యారాశినీ...నేను కుంభరాశినీ వెదుకుదాం. బెట్...." అన్నావు. వేలాడదీసిన మెడలు బిగు సుకుపోయి చాలా సేపు వెతికి ఓడిపోయాను ఇక వెళ్దాం అంటే రానన్నావు.

"ఎందుకు?"

"ఈ రోజు రాత్రి అమృతం కురుస్తుంది"

"వాట్?"

ఎక్కడో చుక్కకారిపోయింది. అప్పుడు... నీ కన్నుల్లోంచి వెన్నెల జారిపడ్డ చప్పుడు!

శూన్యంలోకి చూస్తూ ట్రాన్స్‌లో ఉన్నట్టు చెప్పావ్.

"అదిగో అటుచూడు. అనంతమైన దృశ్యాభావాలు. కుక్కిమంచంలో పక్షవాతపు ముసలోడు పెండ్లాం కోసం మూలుగుతున్నాడు. స్టాలిన్‌గ్రాడ్ లోని అనుభూతిలేని సైనికుడు అమెకు రాసిన ఆర్తగీతాన్ని సుబ్బారావు తెచ్చివ్వలేదింకా....

అదిగో.... అటువైపు... అస్థిమూల పంజరాలపై బడి గొంగళి పురుగులు 'రొటీన్'ని కొరుక్కు-తింటున్నాయి.

కాశ్మీర్ సరిహద్దుల్లో కాలిపోయినవాడి కొడుకు నాన్నకోసం వేధిస్తుంటే ఆ తల్లి రుద్ధకంఠంతో 'జైహింద్' అంటోంది. నీకు విన్పిస్తోందా...?

చిన్నమ్మ వెళ్ళిపోతుందని సిఐడీ రిపోర్టు పంపుదాం... ఆమెపోయినా పాట మిగలనీ.... ఆస్ట్రేలియన్ ఎబోరిజన్స్, నెసిసిటీ ఆఫ్ ఎబోర్షన్స్‌నీ కలగలిపి సుబ్బారావ్ పెళ్లాం సూర్యంతో లేచిపోయిన కథనాన్ని అభినవ ఋగ్వేదంగా రాస్తున్నారు ఘోస్టురైటర్లు.

అస్వతంత్ర వితంతువులు నెరిసిన వసంతాన్ని వెతుకుతున్నారు. హార్లెమ్స్‌లో నిశవం ఏడుస్తోంది.... ఊ... కూచుందాం రా నేస్తం!

నిన్నరాత్రి వానలో తడిసి భూమి పండుముసలిదైపోయింది. రాత్రిని రంపంతో కోసి వేకువను లాగుదాం... పదపద... మన వంశపిత కాడ్మస్ గృహలక్ష్మిని మృత్యువు రేప్ చేయకముందే.... కనురెప్పల సందుల నుండి శిక్షాపత్రాన్ని జారవిడుద్దాం!

కురుస్తోంది అమృతం... కత్తీలేని అమృతం. అదిగో అప్సరసలు నిన్నూ, నన్నూ పిలుస్తున్నారు పరిగెత్తు... ఈ మరమనుషులకు దూరంగా పయనిద్దాం......."

నువ్వెప్పుడూ ఆశ్చర్యార్థకమైతే నీమాట లెప్పుడూ సమాధానం దొరకని ప్రశ్నార్థకాలు. ఆరాత్రి నీ మాటలర్థంగాక బ్రిడ్జిరెయిలింగ్స్‌కి నేను తలబాదుకున్నప్పుడు వాస్తవంలోపడ్డ నువ్వు ఎంత నిర్మలంగా నవ్వావ్.

అక్కడి రేలకంటే స్వచ్ఛంగా!

ఇప్పుడేం మాట్లాడావని బేలగా అడిగితే... నా జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి నుదుటిమీద చుంబించావు. ఆ వెన్నెల క్షణాలు మరువలేను... చెట్టాపట్టాలేసుకొని పరుగెత్తి ఆకాశం వంగినచోట నువ్వు అనేకమయిన ముద్దులు కురిపిస్తుంటే నిజంగా అమృతం కురిసింది. ఆకాశంలోంచికాదు... నీ అధరాల్లోంచి...

## వసంతం

ఎక్కడో కోయిల కూహూ అంటె నువ్వు ప్రతిగా కూస్తావు. అది నీతో పోటీపడి కూసేది. నీతో గడిపిన ప్రతి ఘడియ సొంతమయిన వసంతమే.

"నిన్ను పెళ్లి చేసుకున్నాక 'బావా' అని పిలుస్తాను" గోముగా నువ్వంటె "నువ్వేం మా నాన్నగారి తోడబుట్టిన చెల్లెలి బిడ్డవి కాదుకదా" అని నేనన్నాను. నీ ముక్కుపుటాల్లో రోషం.

"అసలు ఏ ఆడదయినా పెళ్లయ్యాక మొగుడ్ని బావాఅనే పిలవాలి. బావుంటుంది" నీ మాటల్లోని అర్థాలు, ఆ అర్థాల్లోని ఆవేదనా అర్థం చేసుకోను ఎంత ప్రయత్నించినా సాధ్యంకాదు"

"ఎందుకు?"

"దేవుడు నీ బుర్రలో ట్యూబ్‌లైటు పెట్టాడుగాని ఆంఖర్‌మార్క్ బెడ్‌లైట్ పెట్టినా బావుండేది"

"ఇప్పుడు కరెంటు కొరతగదా, అదికూడావెలగదు" నేను జోక్ చేస్తే నువ్వు సీరియస్‌గానే అన్నావు.

"నన్ను పెళ్ళి చేసుకునేముందు మాఅక్కను పెళ్లి చేసుకుంటావా? అందరు మగాళ్లూ అలాగే చేసుకుంటున్నారు."

రెండు రోజులు ఎంత ఆలోచించాను???

చివరికి నీ పిచ్చి పరాకాష్టకు చేరుకుందనుకునేదశలో A TASTE OF TEARS పుస్తకం ఇస్తూ దానిపై రాసావు.

"వాడు నీకు భర్తకాడమ్మా....
అసహజ వివాహ వ్యవస్థలోపడి
ముందు అక్కను పెళ్లాడాడు.
ఆమె పేరు లక్ష్మి.... వరకట్న లక్ష్మి.
మానవత్వం మళ్లీ మొలకెత్తేవరకూ
వాణ్ణి 'బావా' అనే పిలువ్!"

నీ గుండె సిలిండర్ ప్రేలి ఏ మంటలు రగిలాయో.... ఏ ఆర్త నాదాలు నీ కంఠంలో తారాడాయో గాని నీ ప్రతిమాటలో ఈ వ్యవస్థ కన్పించేది.

"పిలిస్తే తప్పేమిటి? ఈ సృష్టిలో అమ్మ అన్న పదం తర్వాత ఆప్యాయత నిండిన పదం 'బావా' అన్నదొక్కటే" అనేదానివి.

ఆ పిలుపుకోసమే... ఇప్పుడు మిగిలిపోయాను.

నువ్వు దూరమయ్యాక నా నీడకూడా నాకు కన్పించదు. వసంత మెప్పుడో రెక్కలల్లార్చి ఎగిరిపోయింది. నయాగరా జలపాతం నయనాల్లో ఊటపెట్టింది.

నువ్విచ్చిన ఆ TASTE OF TEARS పుస్తకాన్ని నిన్న సము ద్రంలో విసిరేసాను. మరెంత ఉప్పుగా మారిపోయిందో అది. కసితో నత్తగుల్లల్ని చిదిపేసి, ఇసుకలో నీ పేర్లురాసి ముత్యపు చిప్పలను అదిమి చీకటిపడ్డాక వస్తాను. ఓరోజు చీకట్లో మనం పోతూ ఉంటే వెలుగు కాన రాక నేనన్నాను. 'నా గుండెను తీసి నెత్తిమీద పెట్టుకొని నడవనా?' అని.

"అబ్బో.... థాంకోవై పోతున్నావు" అని నవ్వావు. అయనెవరో కన్పిస్తే నీగురించి అడగాలనుంది. 'ఇమామీ అంటే ఏమిటన్న' నీ ఆఖరి ప్రశ్నకు ఇటాలియన్ భాషలో 'నన్ను ప్రేమించు' అనే అర్థాన్ని వెతికి తెచ్చేసరికి నా భవిష్యత్తు జీవితకాలం వెనక్కిపోయింది.

మనసు చివికిపోయినట్టు ఏడ్చాను.

వసంతం ఒక రక్తాశ్రువుని రాల్చిపోయింది.

పక్కింటిపాప రోజూ పాడుతుంది. "తొందరపడి ఒక కోయిల ముందే కూసింది" అంటూ ఆ పాట విన్పించనంతదూరం నీ కోసం పరి గెత్తి.... చెరువుగట్టును చేరుతాను. కొంగలు నీ క్షేమాన్ని అడుగుతాయి. తలొంచుకొని తూములోంచి పారుతున్న నీళ్లల్లోకి గులకరాళ్ల విసుర్తాను. కసిగా....

ఎక్కడో దూరంగా 'యాతం' తోడుతున్న రైతు పాడుతాడు.

"నువ్వొత్తావనే రంగీ వరిపైరు నిక్కింది... రావనీ తెలిసాక బరువుతో కుంగింది" మౌనంగా గట్టుపై పచార్లు చేస్తూ కుహూరావం విన్పిస్తుందేమోనని చూసేవాణ్ణి.

విహంగాల్లా ఎగిసి ఎగిసి ఇంద్రధనుస్సుల మీద జారినప్పుడు, తిన్నెలపై ఇసుక గూళ్ళనికట్టి ఎక్కడయినా 'నైటింగేల్' కన్పిస్తుందేమోనని అడివంతా గాలించినప్పుడు.... ఆ తల్లినిచూసి పాడేదానివి....ఆకులో ఆకునై, కొమ్మలో కొమ్మనై ...ఈ అడవి దాగిపోనా?

ఇప్పుడు మనోరణ్యంలో ఏకాకిని!!

తలుపు తెరపగానే గోడకు ఉరితీయబడ్డ నువ్వు. గదిలో వెగటు వాసన... బస్టాండులో బిచ్చగాడి తలముందర వెలిగిన నకిలీ అగరొత్తుల వాసనలా.... ఎన్నాళ్ళయింది నువ్వీగదికొచ్చి? సుమ సౌరభాలు నీతోనే పోయాయి. నీ గుండెకింద బల్లి తలదాచుకుంది.... నీ మెడవంపులో సాలెపురుగు కలలగూళ్ళని అల్లుకుంటోంది... చెద పురుగులు నిన్ను వెన్నుపోటు పొడుస్తున్నాయి.

అన్నిటినీ చూస్తూ అసమర్థ సైనికుడిలా నేను... మునివేళ్ళతో నుదుటిపై ఏకాంతాన్ని గీసుకుంటాను. పాప పాట విన్లేక మళ్ళీ చెరువు గట్టుకు చేరిన సాయంత్రం రైతు పాడడు.... ఏదో సందేశం విన్పిస్తాడు.

"అయిదోది సదువంగ 'అయ్యా'ని పిలిస్తివి.... ఏడోది సదువంగ 'బాపూ' అంటివి...పదోదీ పట్టాక 'నాన్న' అనంటివి. కాలేజిబోయాక 'డాడీ అంటూ, పెళ్లామొచ్చాక 'గాడిదీ....' అంటివి. గ్యానమెరుగని సదువులెందుకురో... కొడకా.... కట్టెకాలక ఆరిపోతవ్‌రో...."

నాకూ నాన్న గుర్తొస్తాడు. ఏ బాధ్యతో భుజమ్మీద కటుక్కుమంటే భుజాలు తడుముకుంటాను. కనుకొలకుల్లో ప్రవాహ సందోహం తొక్కిసలాడుతుంది. వెనక్కి పచ్చేటప్పుడు ఈతముల్లు గుచ్చి రక్తం స్రవిస్తూనే ఉంటుంది.

శాపగ్రస్తుడనై గదికొస్తాను.

పాప మళ్ళీ పాడుతుంది... అర్ధరాత్రి చిట్లిపోయిన కేకలా....

హృదయ కవాటాలు టపటపా కొట్టుకొని నాలో జడంగా ఉన్న హిమశిఖరాలు కదిలి... కరిగి బంగాళాఖాతమై కొలకుల్లో చేరి... పల్లం లోకి జారి... చెక్కిలిపై ఎండిపోయి ఎడార్లను గుర్తుచేస్తుంది.

చెక్కిలిపై సహారా!!

ఆఎడారిలో తలపులకోయిల ఆశతో కూస్తుంది... వసంత మొస్తుందని!!!

## ఆవేశం

నువ్వు ఆఖరుగా అందించిన అనంతాన్ని చదివాక నువ్వు లేని నేనూ కోకోజం (?) వైపు వెళ్ళాను మొన్న.

నీ మీది కసికొద్దీ.... ఒక్కసారి ఉష్ట్రికిలా ఆమె ఒడిలో తల దూర్చి విగ్గరగా ఏడ్వాలని...

అంతరాల్లో ఆగిపోయిన కసి... కొన్ని గంటలైనా నిన్ను మర్చి పోవాలని. ఆమె గదినిండా క్షయ ప్రతిధ్వనిస్తోంది. పాతాళంలో పూడుకు పోయిన నవ్వుని గాలమేసి తీసింది నన్ను చూసి. అవి శకలాలై పెదాలపై నించి నిర్లిప్తంగా జారిపోయాయి.

'బాబూ'

రైతుపాట వింటే నాన్నెలా గుర్తుకొచ్చాడో... ఆమెని చూడగానే. అమ్మ గుర్తుకొచ్చింది. "ఎక్కడున్నావయ్యా... మహాకవీ! ఇదిగో చెరి గిన స్వప్నాలు... చెదిరిన స్వర్గాలు రథచక్రాల కిందబడి శిలం చితికిన జీవితాలు... ఇంట్రావీనస్ ఇంజక్షన్ల ఉత్పత్తి కారకులు... నీ మరో ప్రపంచంలో ప్లాటున్నాయా...?" అని అరవాలన్పించింది.

దీపం వత్తిని పెంచుతూ "ఏం ఆలోచిస్తున్నావ్ బాబూ.... ఇంకా చీకటి పడలేదనా?" నవ్విందామె. నేను నవ్వలేదు....

అంగి జేబులోని ఆరోగ్యాన్ని అక్కడే పడేసుకుంటూ వక్షోజాల్లోని వసంతాన్ని చూశ్లేదు. ఆమె కడుపులో స్మశానవాటికను చూసాను. ఆరెంపీ డాక్టర్లు అంతస్థులకు పునాది రాశ్శేసింది ఆమె గర్భాశయంలోంచే—

"ఏడేళ్ళక్రితం నా శీలానికి వేలం పాడితే అంబరాన్ని చుంబించేది రేటు. ఎన్నోరకాల పంటి విషం చర్మ రంధ్రాల్లో కూరుకుపోయి ముడత లొచ్చాయి."

ఒక దీపం పురుగు అగ్గిలో దూకి ఆర్పేసింది. ఆమె తిరిగి దీపాన్ని వెలిగించుకుందో లేదో కాని నేనక్కడలేను. గదికొచ్చి మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టేసి గెడ్డమాన్చి కూచొని అమ్మని తలుస్తూ ఏడ్చాను అర్ధరాత్రి వరకూ...అయినా ఆమె గుర్తొస్తూనే ఉంది.

మొహానికి మేకప్ లేక....
శీలానికి లాకప్‌లేక
కామానికి కామాల్లేక....
జీవితాలకు ఫుల్‌స్టాప్‌లేక...

## స్వేచ్ఛ

ఆ రోజు ఇద్దరం మైదానంలో నడుస్తున్నాం. దూరంగా మనలాగే ఒక జంట.

"వాళ్ళని చూడు ఎంత బాగున్నారు?" నువ్వడిగావు.

"మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా"

"వూహూ"

"మనలాగే..."

"కాదు"

"మరెలా?"

"రాజేశ్వరీ అమీర్‌లా లేరూ?"

"వాళ్ళెవరు....మీ పక్కింటివాళ్లా?"

కిలకిలా నవ్వావు. "నువ్వు స్వేచ్ఛకోరేవాడివైతే 'నర్తకి' లా నీ వెంట నడిచేదాన్ని....ఒక మొద్దురాతిచిప్ప చుట్టూ తిరుగుతున్న చేపపిల్లలా ఉన్నాను. నా ఖర్మకొద్దీ దొరికావ్. వ్వె....వ్వె....వ్వె" అని వెక్కిరించి పరుగులు తీసేదానివి. నీ వెనుకే నేను ఉరికి ఉరికి అలసిపోయి కూచుంటే సముద్రంలోని నీళ్ళుతెచ్చి నెత్తిన గుమ్మరించి తుర్రుమనేదానివి.

ఎక్కడికో తీసుకుపోయి 'అలశిలను ఢీకొంటుంది. చూద్దాం'అంటూ గంటల తరబడి నిరీక్షణ. అలరాదు. శిలను తడిపెయ్యదు. చీకటవుతుంది అయినా వెళ్ళవు. "మీ అమ్మ తిడుతుందేమో అంటే" అమ్మ పెట్టే చివాట్లన్నా...ఆత్రేయ పాటలన్నా చాలా ఇష్టం అనేదానివి.

పక్కింటి జనరంజని రేడియో, గదిలోని మన ఏకాంతాన్ని భంగం చేస్తున్నప్పుడు ప్లస్, మైనస్ వైర్లను ప్లగ్‌లో పెట్టి గట్టిగా ఊపావ్... గుర్తుందా? నీ చిలిపితనానికి బర్ర్‌ర్‌మన్న రేడియోని పట్టుకొని పాపం ఆ యజమాని రిపేరు షాపులచుట్టూ ఇప్పటికీ తిరుగుతున్నాడు.

అది చూసి ఎంతగా నవ్వేవాళ్ళం....

ఎంత స్వేచ్ఛగా ఎగిరేవాళ్ళం...జాతీయ పతాకంలా!! ప్రేమ కపోతాల్లా...

ఒక్కసారిగా మనచుట్టూ ఎందరెందరో....

తుపాకు లెత్తిపట్టిన గాడ్సేలు....

పిస్టళ్లు ఎక్కుపెట్టిన సత్వంత్‌లు...

ట్రిగ్గర్లు నొక్కిపట్టిన బియాంత్‌లు....

రౌడీలు...రోమియోలు....రాక్షసులు...మీ వాళ్ళంతా. ఒక్క రాత్రి సైకిల్ చెయిన్‌లు....ట్యూబ్‌లైట్లు వీపుమీద విలయతాండవం చేసిన నిశరాత్రి....

ఇదిగో....మూడేళ్ళయినా మాయని మచ్చలు. వాటిని తడిమినప్పుడల్లా నా మనోగుహలో నీ లయ తాలూకు కేకలేవో లీలగా విన్పిస్తాయి. అందరి అప్యాయత క్రొవ్వొత్తిలా కరిగిపోయాక అంతులేని శోకంతో

శూన్యంలోకి కన్నీటి బిందువుల్ని విసుర్తాను. అవి గ్రహాలై! నీ చుట్టూ పరిభ్రమిస్తాయి. శకలాలై రాలిపడితే శలభాన్నై చచ్చిపోతాను.

ఎవరో వచ్చి గిల్లి పోతారు....

బ్లేడులతో నిలువెల్లా చెక్కిపోతారు....

## విస్ఫోటనం

ఈరోజు ఉగాదేమో....ఊరంతా తోరణాలు కట్టివుంది.

మనోవల్మీకంలో అణువంత ప్రశాంతత. నాకే ఆశ్చర్యంగా ఉంది. మూడేళ్ళ అలజడి పట్టి కొట్టుకుపోయినట్లు ఎందుకీ నిర్మలత...??

అలవాటు పడ్డానేమో? బలవంతంగా నిన్ను తల్చుకుంటూ నడుస్తున్నాను. నడక నా ప్రాణం. గుడిలోంచి పంచాంగం విన్పిస్తోంది. మనసు చెద తొలిచిన పంచమ వేదమై ఘోషిస్తోంది.

ఒక్కసారి వచ్చిపోవూ....గ్రీటింగ్సు చెప్పడానికైనా...

సైకిల్ బెల్‌తోపాటు 'నమస్తే సార్' అన్న మాటలు నీ ఆలోచనల్ని చెదరగొడితే చూసాను.

పోస్టుమాన్ సాయిలు.

వాడికి తెల్సు...నా కనుగుడ్లు వాడి సైకిల్ చక్రాలకిందపడి చిట్లిపోతాయని....

"నిన్న ఈవెనింగ్ పోస్టులో వచ్చింది సార్—" పోస్టల్ ముద్ర సరిగాపడన్ని గులాబీ రంగు కవరు చేతిలో పెట్టాడు. ఒక మహర్షిలా కన్పించాడు.

అడ్రస్‌మీది నా [illegible] చూసి ఆదుర్దాగా చింపాను.

పాల నురగమీద గీసిన ఎర్రటి అక్షరాలు...

"నువ్వూ మారలేదు...
నేనూ మారలేదు....
కాలం మారిపోతే నేరం మనదికాదు!
బాగున్నావా నేస్తం....???"

ఆత్రేయ బొమ్మ గ్రీటింగ్‌తో పంపిన అక్షరాలు...మెదడు అరల్లో ఫెటేల్మన్న విస్ఫోటనాలు...

ఎక్కణ్ణించో...ఆమె రాసింది....

ఆమె రాసింది ....

ఆమె రాసింది....

గొంతెత్తి అరిచాను. వూరు ఉలిక్కి పడింది. నాగది ఎటువైపుందో గుర్తు రాలేదు. లక్షలసార్లు చదువుకొని కోట్లసార్లు జ్ఞాపకం చేసాను.

నువ్వు కన్పించకపోయినా...నీ అక్షరాల ఆలంబన చాలదూ...

సింధూ...ఐ లవ్ యూ....

కరిగిపోయే స్వప్నాన్ని చక్రంలా కదిలించుకుంటూ మళ్ళీ చెరువు గట్టుమీదికి చేరుతాను. రంగి వస్తోందని రైతు పాడుతాడు!!!

* * *

అతడి అంతరాన్ని పసిగట్టి మరో పదేళ్ల బ్రతికించుకోవాలనే ప్రయత్నంలోనేనేమో....నాటకమాడిన పోస్టుమాన్ నవ్వుని అతడు గుర్తించనే లేదు.

అతడు పంపిన నిశ్శబ్ద శాసనం....

ఇతడి బలి వితర్దిమీద జీవితకాలపు చలనం!.... ★